epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 218 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 17 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131


## మీరు సాయం చేస్తే.. పుంజుకుంటాం

- వైకాపా హయాంలో ఆర్థిక విధ్వంసం
- ఆదాయం కంటే ఖర్చు ఎక్కువైంది
- అదనపు కేటాయింపులు ఇప్పించండి
- ఏపీ పునర్నిర్మాణానికి అండగా నిలవండి
- 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు వినతి
- సచివాలయంలో స్వయంగా ఎదురెళ్లి స్వాగతం
- రాజధాని సహా వివిధ అంశాలపై ప్రజంటేషన్

2లో





## ఆ 100 ఎకరాల్లో పూర్వస్థితిని పునరుద్ధరించండి

- సంబంధిత ప్రణాళికను నాలుగు వారాల్లో సమర్పించండి
- కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- మేం ఆ భూమి తాకట్టు, యాజమాన్య హక్కుల విషయాల జోలికెళ్లడం లేదు
- పర్యావరణ పరిరక్షణకు అవుట్ ఆఫ్ ద వే వెళ్తామన్న కోర్టు
- వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ
- నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిక
- తదుపరి విచారణను మే 15కు వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం

2లో

## సరికొత్త సచివాలయం

- ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు
- రూ.4,688 కోట్ల అంచనాతో బిడ్ల ఆహ్వానం
- వచ్చే నెల 1 వరకు గడువు

2లో



## అన్నదాతల కన్నీటి రాశులు

- అకాల వర్షా లకు తడిసిపోతున్న ధాన్యం
- కాపాడుకుందామన్నా పట్టాలు కరవు
- కొర్రీలు భరించలేక మిల్లర్లకు విక్రయం

**సమయం న్యూస్, ఖమ్మం:** అన్నదాతల ఆరుగాలం కష్టం వర్షార్పణమవుతోంది. పది రోజులుగా ఈదురుగాలులతో రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు కంటిమీద కునుకు కరవైంది. కర్షకులు కల్లాలు.. రహదారులు.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోస్తున్నారు. వీరికి పంపిణీ చేయాల్సిన పట్టాలు అరకొరగా ఉంటున్నాయి. పంట కోతల అనంతరం మార్కెట్ లో ఆరబోసిన ధాన్యం నిల్వలను సకాలంలో కొనుగోలు చేయాల్సిన నిర్వాహకులు తేమ, తాలు పేరిట కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ,

తరువాయి 2లో





## చైనాపై 245 శాతానికి సుంకాలు

- అగ్రరాజ్యం ఉగ్రరూపం

వాషింగ్టన్: ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా ఎగుమతులపై ఏకంగా 245 శాతం సుంకాలను అమెరికా విధించింది. అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ విమానాల ఆర్డర్లను తీసుకోవద్దని తమ కంపెనీలను చైనా ఆదేశించడంతోపాటు కీలకమైన ఖనిజాల ఎగుమతిని నిలిపేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. 'అత్యంత కీలకమైన, అరుదైన ఖనిజాల ఎగుమతిని చైనా నిలిపేయడంవల్ల జాతీయ భద్రతకు ఎదురయ్యే సవాళ్లపై పరిశోధన జరపడానికి ఉద్దేశించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే 'అమెరికా ఫస్ట్ ట్రేడ్ పాలసీ'కి అనుగుణంగా 'మేక్ అమెరికా ఎకానమీ

తరువాయి 2లో

## రూ.27 వేల కోట్ల పెట్టుబడులు

### 5,600 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్లు

- రెండు సంస్థలతో రెడ్కో ఒప్పందం
- 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**సమయం న్యూస్, హైదరాబాద్, రాజేంద్రనగర్ :** రాష్ట్రంలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల హరిత ఇంధనం(గ్రీన్ పవర్) ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రణాళిక అమలులో భాగంగా జనవరిలో క్లీన్ అండ్ గ్రీన్ పవర్ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. రాజేంద్రనగర్‌లోని

తరువాయి 2లో




## 21న ప్రధానితో వాన్స్ భేటీ

* కుటుంబ సమేతంగా భారత్‌కు రానున్న అమెరికా ఉపాధ్యక్షుడు

2లో





## అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం

- ఆ 400 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూములు
- 2004లోనే నాటి ప్రభుత్వం అభివృద్ధి పనులకు కేటాయించింది
- సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సీఎస్ వెల్లడి

2లో

## కరెంటునూ దాచుకోవచ్చు.. వాడుకోవచ్చు!

- రాష్ట్రంలో 3 వేల మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టులు
- వెయ్యి మెగావాట్లకు టెండర్లు పిలిచిన విద్యుత్ సంస్థలు
- జెన్‌కో థర్మల్ బ్యాక్‌డౌన్ చేసినా.. 1,500 మెగావాట్ల మిగులు
- ఏడాదిలో మరో 10 వేల మెగావాట్ల సౌర విద్యుత్

2లో



# ఆ 100 ఎకరాల్లో పూర్వస్థితిని పునరుద్ధరించండి

దిల్లీ: కంచ గచ్చిబౌలిలోని 100 ఎకరాలలో ధ్వంసం చేసిన పచ్చదనాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు సంబంధించిన ప్రణాళికను నాలుగు వారాల్లోపు సమర్పించాలని నిర్దేశించింది. చెట్లు కొట్టేయడంతో ఇబ్బందిపడుతున్న వన్యప్రాణుల సంరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలంది. ఆ భూమిని తాకట్టు పెట్టారా? లేదా? దీని యజమాని ఎవరన్న వివరాల జోలికి పోవడంలేదని, కేవలం పర్యావరణ పరిరక్షణ వరకే పరిమితం అవుతున్నట్లు పేర్కొంది. పర్యావరణ పరిరక్షణకు అవుట్ ఆఫ్ ద వే వెళ్తామని, ఆర్టికల్ 142 కింద ఏ ఆదేశాలైనా ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందని గుర్తుచేసింది. కంచగచ్చిబౌలి భూముల్లో బుల్డోజర్లతో చెట్లను తొలగించడంతో అక్కడి వన్యప్రాణులు పడుతున్న ఇబ్బందుల గురించి ప్రసారమాధ్యమాల్లో విస్తృతంగా కథనాలు వెలువడటంతో విషయం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. పర్యావరణ అంశాల్లో సుప్రీంకోర్టుకు సహకారం అందిస్తున్న అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ ఆ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించి తక్షణం అక్కడ జరుగుతున్న పనులపై స్టే విధించడంతోపాటు అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని కేంద్ర సాధికార కమిటీ(సీఈసీ)ని ఆదేశించింది. దాంతో ఆయా వ్యవస్థలు తమ నివేదికలను దాఖలు చేయడంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్‌సింఘ్వీ, మేనకా గురుస్వామి, కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా, సీఈసీ తరఫున అమికస్‌క్యూరీ పరమేశ్వరన్, మరికొందరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రినాయుడు, ఎస్.నిరంజన్‌రెడ్డి, గోపాల్‌శంకర్‌నారాయణన్‌లు వాదనలు వినిపించారు. వాల్టా కింద స్వీయధ్రువీకరణ ద్వారా కొన్ని రకాల చెట్లను తొలగించేందుకు వెసులుబాటు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అనుసరించి ఈ ప్రాంతంలో చెట్లను కొట్టేసిందని తెలంగాణ తరఫున వాదించిన అభిషేక్‌సింఘ్వీ తొలుత ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అయితే, ఆ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం కొన్నిప్రాంతాలకు మాత్రమే మినహాయింపు ఉందని, చెట్లకు ఎక్కడా మినహాయింపులేదని అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ గుర్తుచేశారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం ఈ 400 ఎకరాల భూమిని రూ.10 వేల కోట్లకు తాకట్టు పెట్టిందని, ఆ తర్వాతే చెట్ల నరికివేత ప్రారంభమైందన్నారు. ఈ వాదనల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. "చెట్లుకొట్టడానికి మీరు ఎవరైనా అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా అన్న ప్రశ్నకు అవునో కాదో సమాధానం చెప్పండి. 1996 డిసెంబరు 12న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులకు అతీతంగా చెట్లు కొట్టేయడానికి అదనపు మినహాయింపులు ఉన్నాయా? ఆ మినహాయింపులు సుప్రీంకోర్టు ఉత్తర్వులకంటే గొప్పవా? నాటి ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు చెట్టు అన్న పదానికి విస్తృత అర్థాన్ని చెప్పింది. చిన్న పొదలను తొలగించే విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం రెండు దశాబ్దాలుగా పోరాడుతోంది. మహారాష్ట్రలోని జుడిపీ అడవులు వాస్తవంగా అడవులుకావని నాకు వ్యక్తిగతంగా తెలుసు. అక్కడ హైకోర్టు, సచివాలయం, న్యాయమూర్తుల భవనాలను నిర్మించినప్పటికీ దానిపై తలెత్తిన వివాదంపై మహారాష్ట్ర పోరాడుతోంది. ఇక్కడేమో 1996 ఉత్తర్వులను బైపాస్ చేసి స్వీయ ధ్రువీకరణతో చెట్లు కొట్టేయడం ఆశ్చర్యం కల్గిస్తోంది. మేం సీఈసీ నివేదికను ఇంకా చూడలేదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యదర్శులను తీవ్ర చర్యల నుంచి రక్షించుకోవాలనుకుంటే ప్రస్తుతం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెబుతూ కార్యాచరణ ప్రణాళిక సమర్పించండి. పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం. ప్రస్తుత కేసులో చెట్ల కొట్టివేతతో ఆవాసం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న జింకలపై వీధికుక్కలు దాడిచేసిన వీడియోలను చూసి ఆశ్చర్యపోయాం. అదృష్టవశాత్తు మా ఆదేశాలమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఆగమేఘాల మీద సంఘటనా స్థలానికి వెళ్లి నివేదిక పంపారు. చెట్లను కొట్టేందుకు అనుసరిస్తున్న స్వీయధ్రువీకరణ విధానం... ఇరవై ఏళ్లుగా కొనసాగుతోందని మీరు (సింఘ్వీ) చెబుతున్నారు. అయితే అది ఏ ప్రభుత్వం చేసినా తప్పే. వాల్టాకు మంత్రులు, అధికారులు చెప్పిన అర్థం ఆధారంగా మేం వెళ్లం" అని జస్టిస్ గవాయ్ తెలంగాణ న్యాయవాదిని ఉద్దేశించి పేర్కొన్నారు.

**సెలవు రోజుల్లో తొందరేమి?**

ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చెట్లుకొట్టేయడాన్ని సమర్థించుకోవడానికి బదులు ఆ ప్రాంత పునరుద్ధరణ కోసం ప్రణాళికతో ముందుకురావడం మంచిది. లేదంటే అక్కడ తాత్కాలికంగా నిర్మించే జైలుకు ఎంతమంది అధికారులు వెళ్తారో చెప్పడం కష్టం. సెలవురోజుల్లో చెట్లు కొట్టేయాల్సింత తొందర ఏమొచ్చింది? దీనివెనుక కసరత్తు ఏళ్లతరబడి జరిగి ఉండొచ్చు. కానీ బుల్డోజర్లను మాత్రం సెలవుదినాల్లోనే దింపారు. ప్రస్తుతం 100 ఎకరాలను పూర్వస్థితికి తీసుకొచ్చేలా పునరుద్ధరించండి. ఆశ్రయం కోల్పోయిన వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆ పనులను వన్యప్రాణ సంరక్షణాధికారి వ్యక్తిగతంగా పర్యవేక్షించేలా చూడాలి. లేదంటే అక్కడున్న చెరువు గట్లపై తాత్కాలిక జైళ్లు నిర్మిస్తే కొందరు అధికారులు సేదతీరడానికి వీలవుతుంది. రాష్ట్రంలో అటవీ ప్రాంతాల గుర్తింపునకు ఏర్పాటు చేసిన కమిటీలో విభిన్న కార్పొరేషన్ల అధికారులను ఎందుకు నియమించారో మాకు అర్థంకాలేదు. ఆ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం మార్చకపోతే మేమే రద్దు చేస్తాం.

* **నగరాల్లో హరితవనాలు ఉండనివ్వండి..**

మొత్తం 2,300 ఎకరాల్లో వివాదాస్పద భూమి 400 ఎకరాలని చెబుతున్నారు. మేం ఆ మొత్తం భూమిలో ఎక్కడా చెట్లుకొట్టొద్దని ఆదేశాలు ఇవ్వవచ్చేమో. నగరాల్లో హరితవనాలను ఉండనివ్వండి. ముంబయిలో సంజయ్‌గాంధీ నేషనల్ పార్క్, చెన్నైలో గిండీ నేషనల్‌పార్క్, జైపుర్‌లో అల్వార్ నేషనల్ పార్కులున్నాయి. 2017 నుంచి సుస్థిర అభివృద్ధి కోసం నేను ప్రచారం చేస్తున్నా. పర్యావరణంఅభివృద్ధి మధ్య సమతౌల్యం పాటించేలా 2017లో నాగ్‌పుర్ హైకోర్టు నుంచి తొలి తీర్పు ఇచ్చా. అభివృద్ధి చేయాలనుకుంటే నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలి. ఇక్కడ ఇదివరకున్న పరిస్థితులను యథావిధిగా పునరుద్ధరించడం మా ప్రథమ ప్రాధాన్యం. ఆ తర్వాత పరిస్థితులకు అనుగుణంగా ఏం చేయాలనుకున్నా మీ ఇష్టం. ఇకపై అక్కడ ఒక్క చెట్టుకూడా నేలకొరగకూడదు" అని జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టంచేశారు. కేంద్ర సాధికార కమిటీ సమర్పించిన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పునరుద్ధరణ ప్రణాళికనూ ఆలోపు సమర్పించాలంటూ తదుపరి విచారణను మే 15కు వాయిదా వేశారు.

* **ప్రైవేటు అటవీ భూముల్లో చెట్లు కొట్టేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే**

ఈ భూమిని తాకట్టు పెట్టిన విషయాన్ని తెలంగాణ సీఎస్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ చేసిన వాదనలతో జస్టిస్ గవాయ్ విభేదించారు. "ఈ భూమి యాజమాన్య హక్కులు ఎవరివన్న విషయం జోలికి మేం వెళ్లడంలేదు. దాన్ని ధ్రువీకరించే అధికారం సీఈసీకి లేదు. అక్కడ చెట్లు కొట్టేశారా? లేదా? ఒకవేళ కొట్టేసి ఉంటే అందుకు అనుమతులున్నాయా? లేదా? అనుమతులు లేకుండా ఎన్ని చెట్లు కొట్టేశారు? అన్నది చూడటం వరకే సీఈసీ బాధ్యత. ప్రైవేటు అటవీ భూముల్లో చెట్లు కొట్టేయాలన్నా కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ముంబయిలోని ఆరే ప్రాంతంలో మెట్రో డిపో నిర్మాణానికి హైకోర్టు అనుమతిచ్చిన తర్వాతే చెట్లు కొట్టేయాల్సి వచ్చింది.

## 21న ప్రధానితో వాన్స్ భేటీ

దిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ నెల 21న భారత్ పర్యటనకు రానున్నారు. తన సతీమణి, తెలుగు మూలాలున్న ఉషా వాన్స్, పిల్లలు ఇవాన్, వివేక్, మీరాబెల్‌లతో కలిసి ఆయన 24వ తేదీ వరకూ అనధికారికంగా దేశంలో పర్యటిస్తారు. ఆయనది పూర్తిగా ప్రైవేటు పర్యటనే అయినా.. ప్రధాని మోదీతో 21న భేటీ కానున్నారు. సుంకాలతోపాటు ఆర్థిక, భౌగోళిక రాజకీయ అంశాలు వారి మధ్య చర్చకు వచ్చే అవకాశముందని వాన్స్ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసిందని దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం వెల్లడించింది. వాన్స్ పర్యటన వివరాలను భారత విదేశీ వ్యవహారాల శాఖ కూడా ప్రకటించింది.

* భారత పర్యటనలో భాగంగా తన కుటుంబంతో కలిసి దిల్లీ, ఆగ్రా, జైపుర్‌లను వాన్స్ సందర్శిస్తారు. భారత్‌కు వచ్చీ రాగానే వాన్స్ దంపతులు దిల్లీలోని ఎర్ర కోట సందర్శనకు వెళ్తారు.
* మధ్యాహ్నం సమయంలో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో, విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాతో వాన్స్ సమావేశమవుతారు.
* ఆ తరువాత తమ పిల్లలతో కలిసి వాన్స్ దంపతులు ప్రధాని మోదీని కలుస్తారు. వారికి సాయంత్రం ప్రధాని విందు ఇస్తారు.
* 22న వాన్స్ కుటుంబం జైపుర్‌లో పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తుంది.

## కరెంటునూ దాచుకోవచ్చు.. వాడుకోవచ్చు!

అమరావతి: రాష్ట్రంలో మరో వెయ్యి మెగావాట్ అవర్స్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టం (బీఈఎస్‌ఎస్) ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది. వాటికి వయబిలిటి గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కేంద్రం గ్రాంటు ఇవ్వనుంది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బీఈఎస్‌ఎస్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. మొత్తంగా 3,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో సుమారు 19,000 మెగావాట్ల విద్యుత్ ఒప్పందాలు ఉంటే.. అందులో పునరుత్పాదక విద్యుత్ (పవన, సౌర విద్యుత్) ఒప్పందాలు 7,800 మెగావాట్లు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే విద్యుత్‌ను మస్ట్ రన్ విధానంలో తీసుకోవాలి. దీనివల్ల పగటి వేళల్లో ఇప్పటికే సుమారు 1,500 మెగావాట్ల మిగులు విద్యుత్ ఉంటోంది. ఏడాదిలో మరో 10,000 మెగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి రానుంది. అది కూడా అందుబాటులోకి వస్తే గ్రిడ్ బేస్‌లోడ్ నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుందని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి. ఈ కారణంగా విద్యుత్ నిల్వ చేసేందుకు కొత్తగా వచ్చిన బీఈఎస్‌ఎస్ సాంకేతికత ద్వారా 4,000 మెగావాట్ అవర్స్ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బీఈఎస్‌ఎస్ ప్రాజెక్టులకు ఇంధన శాఖ టెండర్లు పిలిచింది.

**థర్మల్ విద్యుత్ బ్యాక్‌డౌన్ చేసిన తర్వాతా..**

రాష్ట్రంలో పగటి వేళల్లో విద్యుత్ డిమాండ్ ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఏదో ఒక టైం బ్లాక్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 13,000 మెగావాట్ల వరకు ఉంటున్నా.. ఎక్కువ టైం బ్లాక్‌లలో (ఒక టైం బ్లాక్ 15 నిమిషాలు) డిమాండ్ 8,000 మెగావాట్ల నుంచి 8,500 మెగావాట్ల మధ్య ఉంటోంది.

## సరికొత్త సచివాలయం

అమరావతి: రాష్ట్ర పరిపాలన కొలువుదీరే ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. సమీకృత రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు వీటిలో రానున్నాయి. మొత్తం ఐదు టవర్లను గతంలో మాదిరే ఈసారీ మూడు ప్యాకేజీల కింద విభజించారు. రూ.4,688.82 కోట్ల అంచనా వ్యయంతో బిడ్లు ఆహ్వానించారు. నాన్ ఎస్‌ఓఆర్ ధరలను ఇటీవలే ఖరారు చేయడంతో టెండర్లకు మార్గం సుగమమైంది. వచ్చే నెల 1న మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్లు దాఖలు చేసేందుకు గడువు నిర్దేశించారు. సాంకేతిక బిడ్లను అదే రోజు సాయంత్రం 4 గంటలకు తెరవనున్నారు. ఐకానిక్ టవర్ల నిర్మాణానికి గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2,703 కోట్లతో టెండర్లు పిలిచారు. వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల వైఖరి కారణంగా ఇప్పుడు అంచనా వ్యయం 73 శాతం ఎగబాకింది. ప్రస్తుతం మొదటి ప్యాకేజీ కింద రూ.1,126.51 కోట్లతో జీఏడీ టవర్ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రూ.1,897.86 కోట్లతో 1, 2 టవర్లు.. మూడో ప్యాకేజీ కింద రూ.1,664.45 కోట్లతో 3, 4 టవర్లు నిర్మించనున్నారు.

**డయాగ్రిడ్ విధానంలో నిర్మాణం**

* ఐకానిక్ టవర్ల ఆకృతులను డయాగ్రిడ్ విధానంలో ఫోస్టర్స్ సంస్థ రూపొందించింది.
* అన్నింటి కంటే ఎత్తుగా నిర్మించనున్న జీఏడీ టవర్ బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే ముఖ్యమంత్రి కార్యాలయం రానుంది. దీని టెర్రస్‌పై సీఎం ప్రయాణాల కోసం హెలిప్యాడ్ నిర్మించనున్నారు.
* మిగిలిన నాలుగు హెచ్‌ఓడీ టవర్లనూ 39 అంతస్తుల చొప్పున నిర్మిస్తారు.
* ఐకానిక్ టవర్ల మొత్తం విస్తీర్ణం 68.88 లక్షల చదరపు అడుగులు.

## అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం

హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూములు కావని, ప్రభుత్వ పోరంబోకు/బంజరు భూములని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి స్పష్టంచేశారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే రూ.50 వేల కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాల కల్పనకు ఈ భూమి అభివృద్ధి ప్రారంభించినట్లు తెలిపారు. దాదాపు ఇరవై ఏళ్లపాటు న్యాయపరమైన వివాదాల్లో ఉండటం, వినియోగంలో లేకపోవడంతో అక్కడ చెట్లు పెరిగాయన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సమగ్ర వివరాలను వెల్లడించారు. ఇందులో ముఖ్యాంశాలు... కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు25లో 2374.02 ఎకరాల భూములున్నాయి. వీటిలో ఐదు నీటి కుంటలున్నాయి. ఇది 'కంచ పోరంబోకు సర్కారీ భూమి'గా నమోదై ఉంది. 1975లో 2,324.05 ఎకరాల పొజిషన్‌ను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(హెచ్‌సీయూ)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అయితే వర్సిటీ పేరిట ఫైనల్ ఎలైనేషన్ ఉత్తర్వులు జారీ కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉంది. హెచ్‌సీయూకి విశాలమైన ఖాళీ భూములున్నాయి. వాటికి, ప్రస్తుత 400 ఎకరాలకు మధ్య ఎలాంటి ఫెన్సింగ్ లేదు. వర్సిటీతోపాటు చుట్టుపక్కల భూముల్లో సంచరించే జింకలు, నెమళ్లు, ఇతర పక్షులు ఈ భూముల్లో వచ్చి పోతుంటాయి. ఈ 400 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం అభివృద్ధి చేసేందుకు ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌తో 2003 ఆగస్టు 9న ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో 400 ఎకరాలను హెచ్‌సీయూ నుంచి తీసుకొని 2004 ఫిబ్రవరి 3న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(శాప్)కి అప్పగించింది.

## రూ.27 వేల కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సమక్షంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెడ్కోతో ఈకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. "సుమారు 5,600 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు ఈ రెండు కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు సన్ పెట్రో అనే కంపెనీ 3,400 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకుంది. అలాగే మేఘా కంపెనీ రూ.7,500 కోట్ల పెట్టుబడులతో రూ.1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ముందుకు వచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగి 17,162 మెగావాట్లకు చేరినా కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సంస్థల సర్వేల ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2035 నాటికి 31,809 మెగావాట్లకు పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాన్ని కాలుష్యానికి దూరంగా ఉంచాలనే సంకల్పంతో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై దృష్టి సారించాం. సరళమైన నిబంధనలతో అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా ఒప్పందం చేసుకున్న కంపెనీలు ప్రణాళికను రూపొందించుకొని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలి" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ఎండీ దీపక్ అగర్వాల్, ఈకోరెన్ ఎనర్జీ సీఎండీ ప్రసాద్ యెర్నేని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం మజుందార్, రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్, రెడ్కో ఎండీ అనిల తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల కన్నీటి రాశులు

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాల్లో కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులు కావొస్తున్నా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ధాన్యంలో తేమ, తాలు కోసం రోజుల తరబడి ఆరబోస్తున్నా..కాంటా వేసే సమయంలో గరిష్ఠంగా రెండు కిలోల వరకు కోతలు విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల మూలంగా అన్ని కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ వందశాతం ఎక్కడా అమలు చేయడం లేదు. నల్గొండలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్ లాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసే ఓపిక లేక.. ఇక్కడి కేంద్రాల్లో విధించే కొర్రీలు, ఆరబోసేందుకు ఖర్చులు భరించలేక.. పొలం నుంచి నేరుగా మిల్లర్లు నిర్ణయించిన ధరలకే అప్పగించి వెళుతున్న పరిస్థితులున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు పరిమిత సంఖ్యలో ఉండటం వల్ల ఎక్కువ సంఖ్యలో ధాన్యం తెచ్చిన రైతులు ఎదురుచూపులు చూడాల్సి వస్తుంది.

**కొనుగోలు అంతంతే..**

ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా 12.69 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 4.80 లక్షల ఎకరాలకు పైగా సన్నరకాలను, మిగిలినవి దొడ్డురకాలను రైతులు పండించారు. మొత్తం 8 లక్షల టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నల్గొండలో 384 కొనుగోలు కేంద్రాలుంటే ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. సూర్యాపేటలో 311 కేంద్రాల్లో 20శాతం, యాదాద్రి భువనగిరిలో 372 కేంద్రాల్లో 40శాతం మేర ధాన్యం కొనుగోలు చేశారు. పలు మండలాల్లో ధాన్యం వర్షానికి తడిసిముద్దయ్యింది. ఖమ్మం జిల్లాలో మొత్తం 1,38,281 ఎకరాల్లో సన్నాలు, 87,029 ఎకరాల్లో దొడ్డురకం వరి సాగుచేశారు. 2.59లక్షల టన్నుల ధాన్యం సేకరించేలా అధికారులు 344 కేంద్రాలను తెరిచినా 40 శాతంలోపే కొనుగోలు చేశారు. కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, చింతకాని, ఖమ్మం అర్బన్, వేంసూరు మండలాల్లో అకాల వర్షాలకు వరి పంట దెబ్బతినగా కొనుగోలు కేంద్రాల్లోనూ అక్కడక్కడ ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి.

## చైనాపై 245 శాతానికి సుంకాలు

(మొదటిపేజీ తరువాయి)

గ్రేట్ ఎగైన్' కోసం ఆయన పని చేస్తున్నారు. 75కు పైగా దేశాలు కొత్త వాణిజ్య ఒప్పందాల కోసం ఇప్పటికే మమ్మల్ని సంప్రదించాయి. అందుకే సుంకాలను ప్రస్తుతానికి నిలిపేశాం. ఒక్క చైనాపై తప్ప' అని మంగళవారం శ్వేతసౌధం విడుదల చేసిన వాస్తవ పత్రం వెల్లడించింది. అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై చైనా ప్రస్తుతం 245 శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ పత్రం వివరించింది. గతంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించిన చైనా.. శుక్రవారం వాటిని 125 శాతానికి పెంచింది.

**చైనా చర్చల ప్రతినిధిగా చెంగాంగ్**

అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో బుధవారం చైనా.. లీ చెంగాంగ్‌ను తమ చర్చల ప్రతినిధిగా నియమించింది. అంతర్జాతీయ చర్చల్లో ఆయనకు దశాబ్దాల అనుభవం ఉంది. అంతేకాకుండా ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా రాయబారిగా పని చేశారు. చర్చల అంశం చైనా కోర్టులోనే ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మీరు సాయం చేస్తే.. పుంజుకుంటాం

ఆంధ్రప్రదేశ్‌కు సొంతంగా వచ్చే ఆదాయం కంటే అప్పులపై చెల్లించాల్సిన వడ్డీలు, పెన్షన్లు, జీతాలకు ఖర్చు చేసే మొత్తం ఎక్కువగా ఉంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల విధ్వంసం, ఆర్థిక క్రమశిక్షణ కొరవడడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టలేకపోవడం రాష్ట్రానికి భారీ నష్టం కలిగించిందని చెప్పారు. 'మేము నిలబడేందుకు, ముందడుగు వేసేందుకు ఈరోజు మీరు సాయం చేయండి.. రేపటికి పుంజుకుంటాం.. మాకున్న బలంతో అనూహ్య విజయాలు సాధిస్తాం.. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మా వంతు పాత్ర పోషిస్తాం. దేశ నిర్మాణంలో ముఖ్య రాష్ట్రంగా నిలుస్తాం' అని విశ్వాసం వెలిబుచ్చారు. 'రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి.. ఏపీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం అదనపు కేటాయింపులు చేసేలా సిఫారసు చేయండి' విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం సచివాలయానికి వచ్చిన 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియా, సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు తదితర అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. స్వర్ణాంధ్ర 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను తెలియజేయడంతోపాటు.. రాజధానిపై ఆలోచనలను వీడియో ద్వారా ప్రదర్శించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 201419 మధ్య సాధించిన ప్రగతి, వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం, 10 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో తీసుకున్న చర్యలు తదితర అంశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. 'వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలదే ముఖ్యపాత్ర. ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి వర్టికల్ డెవల్యూషన్ వాటా పెంచాలి' అని కోరారు.

# భూములకు పట్టా పాస్ బుక్స్ ఇవ్వండి

* గతంలో ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు.
* వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా, CPM పార్టీ మద్దతు.




**నర్సాపూర్, ఏప్రిల్ 16 (సమయం న్యూస్):** సర్వే నెంబర్ గత 209 లో 70 సంవత్సరాలుగా తాతలు, తండ్రులు కబ్జా లో ఉన్న రెవెన్యూ భూమికి పట్టా పాస్ బుక్స్ కేటాయించాలని కొల్చారం మండలం కొంగోడు గ్రామంలో రైతులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు CPM పార్టీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు మాట్లాడుతూ గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసిన పోరాటాలకు అధికారులు స్పందించి 2012 సంవత్సరంలో సర్వే చేసి పట్టా పాస్ బుక్స్ ఇస్తామని హామీ ఇచ్చిన నేటివరకు ఒక్కరికి కూడా పాస్ బుక్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు 70 సంవత్సరలా నుండి కబ్జాలో ఉన్న భూమికి పాస్ బుక్స్ కావాలని 2002 నుండి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేయడంతో 7 మంది పై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. 209 సర్వే నంబర్ లో 93.13 ఎకరాల భూమి ఉందని అందులో గ్రామానికి చెందిన 110 కుటుంబాలు వ్యవసాయం చేస్తు సంవత్సరనికి రెండు పంటలు తీస్తున్నారని గుర్తుచేశారు. అధికారులు సర్వే చేసినప్పటికే 8 ట్రాన్స్ ఫారలు, 28 బోర్లతో రైతులు వ్యవసాయం చేస్తున్నారని వారు తెలిపారు. 2012 సంవత్సరలో రెవిన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు కలిసి సర్వే నిర్వహించి పట్టా సర్టిఫికెట్స్ ఇస్తామని చెప్పిన నేటివరకు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. సర్వే అనంతరం 24 మంది పేర్లు మాత్రమే నిర్ణయిస్తూ మండల రెవెన్యూ అధికారులు తెలిపిన అందులో 4 మంది కబ్జాలో లేకున్నా ప్రతిపదించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందాన్నారు. ఇప్పటికైనా రైతులు కాస్తులో, కబ్జాలో ఉన్న భూములకు పట్టా పాస్ బుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నిజమైన రెవెన్యూ భూమి ఐతే తప్పకుండ ప్రభుత్వం చెప్తున్నట్లు మీకు పాస్ బుకులు వచ్చేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. భూ భారతి ఈ మధ్యలోనే వచ్చిందని 2,3 నెలలు తర్వాత కచ్చితంగా సర్వే చేసి అర్హులకు పాస్ బుక్స్ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఏసు, స్వామి, దుర్గయ్య, దాసు, మధు, పోచయ్య, అనసూజా, సంతోష, కమలమ్మ, నిర్మల, పోచమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే సహకారంతో
# కమ్యూనిటీ హాలు నిర్మాణం

- **కార్పొరేటర్ ఇ. విజయకుమార్ గౌడ్**

అంబర్ పేట, ఏప్రిల్ 16, సమయం న్యూస్: అంబర్ పేట డివిజన్ దుర్గ నగర్ లో అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో నూతన కమిటీ హాలు నిర్మిస్తామని అంబర్ పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ లో స్థానిక బస్తీవాసులతో కలిసి పర్యటించి ఈ సందర్భంగా బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తి నాయకులు వెంకట్ గౌడ్, నరసింహ గౌడ్, శంకర్, లక్ష్మి, శివకృష్ణ, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.



# దళిత సోదరులకు జై భీమ్

కూకట్‌పల్లి. మేడ్చల్ మల్కాజిగిరి. ఏప్రిల్ 17, సమయం న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్జయంతి వేడు కలలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ గారు ఆగమరచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి అడ్డుగా కుసోని అవమానించినందుకు గాను బహిరంగ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ... ఈ రోజు 160425 సాయంత్రం 5 గంటలకు మన కూకట్పల్లి వై జంక్షన్ వద్ద బాబా సాహెబ్ అంబేద్కర్ గారికి పాలాభిషేకం చేసి మరియు కొవ్వొత్తులతో (క్యాండిల్) నిరసన తెలియజేయాలని మన అంబేద్కర్ ఇస్టులు, అంబేద్కర్ సిద్ధాంతపరులు అభిమానులను కోరుచున్నాము... కావున ప్రతి ఒక్కరు అన్ని వర్గాలు వారు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరుచున్నాము.

# పోషకాహారం తీసుకంటేనే ఆరోగ్యంగా ఉంటారు..

* జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్.

**రాయపోల్, ఏప్రిల్ 16, సమయం న్యూస్ :** ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విధిగా పోశకాహారం తీసుకోవాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషకాహారంపై నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో పోషణ పక్షం సందర్భంగా మండల స్థాయి అంగన్వాడిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పౌష్టికా ఆహారానికి సంబంధించిన స్టాల్స్ ను పరిశీలించి చిన్న పిల్లలకు పలు రకాల పౌష్టికార స్వీట్లను స్వయంగా ఆమెనే తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... బిడ్డ పుట్టినప్పటి నుంచి జీవితాంతం వరకు పోషణ ఆహారం తీసుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. చిరుదాన్యాలతో సమతుల ఆహారం లభిస్తుందని స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీలు పోషణ ఆహారం తీసుకుంటేనే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తుందని తెలిపారు. అలాగే పాప పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలని పేర్కొన్నారు. కనీసం రెండేళ్ల వరకు పిల్లలకు పాలు ఇవ్వాలని చెప్పారు. బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికారాన్ని అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం పెంపొందించడానికి ఆకుకూరలు. పల్లీలు నువ్వులు బెల్లం వస్తువులు. వివిధ రకాల చిరు ధాన్యాలు తీసుకుంటే తల్లి బిడ్డకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాలకూర మునిగే ఆకు. పొప్పెడ. రాగి బెల్లం లడ్డూలు తదితర వాటిని గర్భిణీలు తీసుకుంటే రక్తహీన పరిస్థితి ఉండదని తెలిపారు. అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పథకాలను వినియోగించుకొని. చిన్నారులను అంగన్వాడిలో చేర్పించాలని తల్లులకు సూచించారు. రాయపోల్ మండల వ్యాప్తంగా అంగన్వాడి సెంటర్ చాలా మంచిగా నడుస్తున్నాయని. ప్రతి సెంటర్లో ఎండాకాలం అయినందున ఫ్యాన్లు ఫిటింగ్ చేయాలని ఎంపీడీవో బాలయ్యకు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ ఐసిడిఎస్ సిడిపిఓ సరిత. మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్. ఎంపీడీవో బాలయ్య. ఎంఈఓ సత్యనారాయణరెడ్డి. ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ. షబానా. ఎంపీ ఓ శ్రీనివాస్. ప్రభుత్వ వైద్యాధికారి బల్ల మహారాజు. ఎస్సై వికుర్తి రఘుపతి. పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు కిరణ్. రామ్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు గర్భవతులు చిన్నారులు పాల్గొన్నారు. అంతకుముందు అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ కు ఐసిడిఎస్ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.




# అంబర్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

**అంబర్ పేట, ఏప్రిల్ 16, సమయం న్యూస్:** ఈనెల 27న వరంగల్ జిల్లాలో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారు. గురువారం రోజున సాయంత్రం 5 గంటలకు న్యూ పటేల్ నగర్ లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్ పేట కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ హాజరుకానున్నారు. సిద్ధార్థ ముదిరాజ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సీనియర్ నాయకులు, మహిళలు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



## పలు గ్రామాలలో
# పిఎసిఎస్ ఐకెపి వరి ధాన్యం కేంద్రాలు ప్రారంభం

* ధాన్యం కేంద్రాలను ప్రారంభించిన నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**వెల్దుర్తి ఏప్రిల్ 16, సమయం న్యూస్:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నాడు వెల్దుర్తి మండల కేంద్రంలోని వరి ధాన్య కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాలు కుకునూరు, మన్నె వారి జలాల్పూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామాలలోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని అనంతరం అక్కమ్మ పల్లి గ్రామం, మహమ్మద్ నగర్ తండాలో ఐకెపి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వారు తెలియజేశారు. రైతులు పండించిన వరి పంట ప్రభుత్వమే తీసుకుంటుందని రైతులు అక్రమ దారులకు వరి ధాన్యాన్ని అమ్మకుండా నేరుగా మీకు అందుబాటులో ఉన్నటువంటి వరి ధాన్యం కేంద్రానికి తీసుకొని రావాలని రైతు లేనిదే రాజ్యం లేదని రైతులు పండించినటువంటి ఆరు గారు కష్టాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని వారి శ్రమకు తగినంత ధరను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వరి ధాన్యం కేంద్రాలలో రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎల్లవేళలా సందర్శించి వారికి సహకరించి వారి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ధర ఏ గ్రేడ్ 2320 రూపాయలు సాధారణ రకం 2300 ల రూపాయలు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తేమ 17.0 శాతం వించరాదని చెత్త తాళ్లు 1.0 శాతం మట్టి పేల్లరాలు 1.0 శాతం చెడిపోయిన రంగు మారిన మొలకెత్తిన ధాన్యం ఐదు శాతం పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం 3.0 శాతం తక్కువ రకములు మిశ్రమం 6.0 శాతం రైతులు పండించిన సరుకులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరచి ఎవరి కల్లాల దగ్గర వారే వరి ధాన్యాన్ని ఎండబెట్టుకొని తీసు కొని రావాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ తాజా మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి మెదక్ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్ మాజీ ఎంపీటీసీ అశోక్ గౌడ్ బస్వాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్ పడిగ నరసింహులు సొసైటీ డైరెక్టర్ రమేష్ చందర్ సొసైటీ వైస్ చైర్మన్ కర్ణ మురళి సొసైటీ డైరెక్టర్ ఉదండపురం నరసింహులు బిఆర్ఎస్ నాయకులు వేన్నవరం శ్రీనివాస్ రెడ్డి నర్సాపూర్ ఆంజనేయులు వెన్నవరం గ్యాస్ శ్రీనివాస్ రెడ్డి చల్ల మహేష్ యాదవ్ వ్యవసాయ అధికారిని ఝాన్సీ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మజీద్ వందన సీఈవో సిద్దయ్య అశోక్ తాసిల్దార్ కృష్ణ ఆర్ఐ నర్సింగ్ యాదవ్ పలు గ్రామా పంచాయతీ మాజీ సర్పంచులు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాచకొండ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 2025 క్యాలెండర్ ఆవిష్కరించిన కమిషనర్



**నేరేడ్మెట్, ఏప్రిల్ 16 (సమయం న్యూస్):** ఈ రోజు రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో RP CCS (రాచకొండ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ) 2025 క్యాలెండర్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ & RP CCS అధ్యక్షుడు శ్రీ సుధీర్ బాబు, IPS ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, RPCCS కు సంబంధించిన ఆర్థిక సంవత్సరం 2024-25 ఆడిట్‌ను త్వరితగతిన ప్రారంభించి, సభ్యులకు Thrift పైన వడ్డీ, షేర్‌లపై డివిడెండ్ త్వరలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శివ కుమార్, ట్రెజరర్ బాలరాజ్, డైరెక్టర్లు శ్రీ సంగి వలరాజు, రవీందర్ రెడ్డి, సువర్ణ, మరియు లక్ష్మీ ప్రసన్న గారు మరియు సొసైటీ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

# డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**గుమ్మడిదల ఏప్రిల్ 16 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారా నగర్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు బుధవారం తొ 71 వ రోజుకు చేరుకున్నాయి. ఈ రోజు బొంతపల్లి సిజిఆర్ ట్రస్ట్ సభ్యులు కృష్ణ, శ్రీకాంత్, దాసు, పోచయ్య, ఏడుకొండలు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. డంప్ యార్డ్ ను పూర్తిగా రద్దు చేసే వరకు ఈ నిరసన కార్యక్రమాలు ఆగవని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ,కుమార్ గౌడ్, నరసింహారెడ్డి ,మంద భాస్కర్ రెడ్డి ,మద్ది బాల్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు ,రాజిరెడ్డి, మండల జేఏసీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి..!

అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహితంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శత్రువులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడిరది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో.. బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడిరచడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చుకోవాలి. ఇటీవల ఆక్వా ఎగుమతులపై ట్రంప్ ప్రభావం పడిరది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.

# ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**కరీంనగర్ ఏప్రిల్ 16 సమయం న్యూస్ :** హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో, తుమ్మనపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. తూకం యంత్రాలు, తేమ యంత్రాలు పనితీరును పరిశీలించారు. కల్లాల వద్ద సన్నాలు, దొడ్డు రకం ధాన్యాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. సేకరించిన వివరాలను, మిల్లింగ్ కు పంపే ధాన్యం వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దిష్ట తేమ శాతానికి రాగానే ధాన్యం కొనుగోలు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కట్టింగు, కోతలు లేకుండా కొనుగోళ్లు జరపాలని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 48 గంటల్లోగా రైతులకు ధాన్యం వచ్చేలా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలకు వచ్చే మహిళలకు, ఉపాధి హామీ కూలీలకు 'ఆరోగ్య మహిళ' ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మెడికల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, తహసీల్దార్ కనకయ్య, ఎంపిడిఓ సునీత, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈఓ సౌమ్య ఉన్నారు.

### ఘనంగా పోషణ జాతర

పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ హుజూరాబాద్ ఆధ్వర్యంలో హుజురాబాద్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోషణ జాతర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. పోషణ జాతరలో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, చేతుల పరిశుభ్రత, మిషన్ భగీరథ నీటి ప్రాధాన్యత ప్రయోగం వంటివి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసిన చిన్నారులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్వాడీ చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన కూరగాయల సంత ను పరిశీలించి వారి నుండి కూరగాయలు కొనుగోలు చేశారు.

### సీమంతాలు, అన్నప్రాసన

పోషణ పక్వాడలో భాగంగా పోషణ జాతరను పరిశీలించిన అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. 25 మంది గర్భిణీలకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడలో భాగంగా ఈనెల 22 వరకు పపోషకాహార ప్రాధాన్యతను తెలిపే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, మెప్మా పిడి వేణు మాధవ్, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, తహసిల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, సిడిపిఓ సుగుణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

### బాలికల వసతి గృహం సందర్శన

హుజురాబాద్ కేసి క్యాంపు వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ఇక్కడ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు ఎస్.ఏ 2 హిందీ పరీక్ష రాస్తుండడంతో కల్పించిన ఏర్పాట్లపై ఉపాధ్యాయులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్లోని గదులను, డైనింగ్ హాల్, కిచెన్ సందర్శించారు. వంట పాత్రలు బాగా శుభ్రం చేయాలని, నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని ఆదేశించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయురాలు టి.శారద ఉన్నారు.

### మిషన్ భగీరథ గ్రిడ్ పరిశీలన

హుజరాబాద్ కెసి క్యాంప్ పరిధిలోని మిషన్ భగీరథ గ్రిడ్, కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ఇంట్రా, డివిజన్, గ్రిడ్ కార్యాలయ గదులను, ఇక్కడ ఏర్పాటుచేసిన ల్యాబ్ ను పరిశీలించారు. కార్యాలయ పరిధిలోని సిబ్బంది వివరాలను, ఫీల్డ్ సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సరఫరాలో సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వీరి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్ కుమార్, డివిజనల్ ఇంజనీరింగ్ నసీమొద్దీన్ ఉన్నారు.

### * మున్సిపల్ కార్యాలయం సందర్శన

హుజురాబాద్ పురపాలక సంఘం కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ప్రత్యేక అధికారి ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇక్కడ మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో పొడి చెత్తను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. రిసోర్స్ పర్సన్లు పొడి చెత్త సేకరిస్తుండగా DRC (డ్రై రిసోర్స్ సెంటర్ లకు) తరలిస్తున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కలెక్టర్ కు వివరించారు. ఆర్డిఓ రమేష్, రీసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- **జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు సంతృప్తికరంగా ఉంది**
- **ఇప్పటికే 329 రైతులు 322.83 టన్నుల దిగుబడి సాధించారు**
- **జిల్లాలో 10,339 ఎకరాల్లో కొనసాగుతున్న ఆయిల్ ఫామ్ సాగు**
- **ఈ ఏడాదికి 66,546 మొక్కలు సిద్ధం**
- **జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించిన కేంద్ర ఆయిల్ సీడ్ రీసెర్చ్ డైరెక్టరేట్ ఏడి డాక్టర్ పొన్నుస్వామి**



గజ్వేల్, ఏప్రిల్ 16: సిద్దిపేట జిల్లాలో ఏర్పాటుచేసిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ జూన్ మొదటి వారంలో రైతులకు అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఆయిల్ సీడ్ రీసెర్చ్ డైరెక్టరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పొన్నుస్వామి తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి అక్కారం గ్రామాలతో పాటు కుకునూరుపల్లి గురువన్నపేట నంగునూరు మండలం అక్కనపల్లిలో ఆయిల్ పంప్ సాగును పరిశీలించి నర్మెటలో ఏర్పాటు అవుతున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు వివరాలను అధికారులు డాక్టర్ పొన్న స్వామికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. జిల్లాలో ఇప్పటికే 1039 ఎకరాల్లో సాగుతూ ఉండగా, ఇప్పటివరకు 329 మంది రైతులు 322.83 టన్నుల ఆయిల్ ఫామ్ దిగుబడిని సాధించారన్నారు. 2025 26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ ఫామ్ సాగు కోసం ములుగు నర్సరీలో 66,546 మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సాగుచేసిన ఆయిల్ ఫామ్ను కొనుగోలు చేయడానికి జిల్లాలో మర్కుక్, మిరుదొడ్డి మండలం చెప్యాల వద్ద రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్స్ మొక్కల, డ్రిప్ కంపెనీలో సబ్సిడీని అందిస్తుందని, అలాగే దిగుబడి వచ్చేవరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సరోజినీ దేవి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, అధికారులు రమేష్, కౌసల్య, బాలాజీ శాస్త్రవేత్తలు విజయకృష్ణ ఆయిల్ ఫెడ్ అధికారులు భాస్కర్ రెడ్డి శంకర్, ప్రవీణ్,, నెటాఫిమ్ సుబ్బారావు సంతోష్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- **గిరిపల్లి లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్**



గజ్వేల్, ఏప్రిల్ 16 : లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు. బుధవారం గిరిపల్లీ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. గ్రామానికి మంజురైన ఇళ్ళ వివరాలను తెలుసుకొని ఆయా లబ్ధిదారులైనలకు వెళ్లి పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. త్వరగా ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలనీ, ఇంటిని 400600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇసుక సరిగా లభించడం లేదని అడిషనల్ కలెక్టర్ దృష్టికి లబ్ధిదారులు తీసుకురాగా, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను అందించేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవోకు సూచించారు. కార్యక్రమములో హౌసింగ్ పీడీ దామోదర్ రావు, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎంపీడీవో ప్రవీణ్, పంచాయత్ రాజ్ డిఈఈ అజయ్ , ఎం పి ఓ దయాకర్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అజారుద్దీన్, మీస్కిన్, అన్నపూర్ణ ,అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రజల ఆరోగ్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

* **రూ. 10 లక్షల ఉచిత వైద్య సేవల పరిధి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం**

గజ్వేల్, ఏప్రిల్ 16 : ప్రజల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ సేవలను రూ. 10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి, గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డిలు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మెడిసిటీ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద ఉచిత వైద్య



శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు వైద్య సౌకర్యాలతో పాటు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని, గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు చికిత్సలు ఉచిత కాన్పులు చేయడం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితులు మాత్రమే హైదరాబాద్ కు తరలించడం జరుగుతుందని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య సంక్షేమ పథకాలతో పాటు అనేక పథకాలను అమలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుఖేందర్ రెడ్డిజంగం రమేష్ గౌడ్ నక్క రేగొండ, గాడి పల్లి శ్రీనివాస్ సమీర్ అజ్గర్ డప్పు గణేష్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# దళారులను నమ్మి మోసపోవద్దు...

**రాయపోల్, ఎప్రిల్ 16, సమయం న్యూస్ :** రైతులు దళారులను నమ్మి పంటను అమ్మి మోసపోవద్దని దౌల్తా బాద్ మండల మండల సర్పంచ్ ల ఫోరమ్ తాజా మాజీ గౌరవ అధ్యక్షులు దార సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లేశం పల్లి గ్రామం లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని పేర్కొన్నారు. మద్దతు ధర తోపాటు బోనస్ ను కూడా ఇస్తుందని రైతులు ప్రభుత్వం ఇస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులకు కావలసిన మౌలిక వసతులను కల్పిస్తుందని అన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొంది ఆర్థికంగా లాభం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, ఐకెపి సీఏ అనిత, రైతులు కిషన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఈడి ముసుగులో ప్రతీకారం తీర్చుకుంటున్న మోడీ

* **ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా**

గజ్వేల్, ఏప్రిల్ 16: ఈడి ముసుగులో ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకార చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అంక్షారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి లు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడి అక్రమంగా చార్జిషీట్ దాఖలు చేయడానికి నిరసిస్తూ గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం ప్రధాని నరేంద్ర మోడీ దుర్మార్గ చర్యలకు ఒడిగడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను తన చెప్పు చేతల్లో ఉంచుకుంటూ నిర్వీర్యం చేస్తున్న ఆయనకు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ముఖ్యంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో నిలదీస్తున్న ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై కక్ష తీర్చుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. 2012 లో అప్పటి బిజెపి ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ఫిర్యాదు చేయగా, 13 ఏండ్ల అనంతరం ఈ అంశాన్ని తెరపైకి తేవడం కుట్రపూరితమేనన్నారు. అలాగే ఈనెల 25వ తేదీన నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రత్యేక కోర్టు ప్రకటించిన నాలుగు రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసి వేధింపులకు గురి చేయడం సహించరానిదన్నారు. దివంగత ప్రధాని జవహర్ లాల్ నెహూ ఏర్పాటు చేసిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అక్రమంగా సీజ్ చేయడంతో పాటు కేసులు బనాయిస్తే భయపడతారని అనుకోవడం వారి భ్రమే



అవుతుందని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమంగా బనాయిస్తున్న కేసులపై కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ బాధ్యులు సమీర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, నియోజక వర్గ బాధ్యులు అజహర్, నేతలు సురేందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, శివారెడ్డి, గుంటుకు శ్రీనివాస్, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, యాదగిరి, నేత నాగరాజు, అంజద్, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, చెప్యాల శేఖర్, సొక్కం సురేష్, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ కు రాగుల ప్రవీణ్ పటేల్ అందించిన సేవలను మరువలేము

: **ఎమ్మెల్యే కాలేరు**

అంబర్ పేట, ఏప్రిల్ 16, సమయం న్యూస్: అంబర్ పేట, ఎస్ ఆర్ జి ఫంక్షన్ హాల్ లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కీ. శే. రాగుల ప్రవీణ్ పటేల్ గారి మొదటి వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు పాల్గొని, ఘన నివాళులు అర్పించారు .ఆయన అందించిన అమ్మొల్యమైన సేవలను కొనియాడి,వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలబడతామని మాట ఇచ్చారు. అదేవిధంగా వారి పిల్లల చదువులకు, కుటుంబానికి బాసటగా ఈ రోజు 3 లక్షల రూపాయలు చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు,రామారావు యాదవ్,నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీరాములు ముది రాజ్, రాజగోపాల్ నాయుడు, గెలవయ్య, వంజరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ పర్యటనకు వెళ్తున్న మంత్రి శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం

కరీంనగర్ ఏప్రిల్ 16 సమయం న్యూస్ : తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా జపాన్ పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు బుధవారం ఘన స్వాగతం లభించింది. కరీంనగర్ లో వివాహాది శుభకార్యానికి హాజరై హైదరాబాద్ వెళుతున్న మంత్రి శ్రీధర్ బాబుకు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



అబ్దుల్ సమద్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సమద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం జపాన్ పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గతంలో రెండుసార్లు సీఎం, మంత్రి విదేశీ పర్యటనకు వెళ్లారని, పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పుడు అదే విధంగా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చే అవకాశం ఉందని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు. ఇక తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలోనే గొప్ప రాష్ట్రంగా వెలుగొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు బుధవారం సాయంత్రం జపాన్ పర్యటనకు బయలుదేరి వెళ్లనున్నారు.



# బెదిరింపు కాల్స్ వస్తే భయపడొద్దు

- **సీఐ రవీందర్ రెడ్డి**

**జిన్నారం ఏప్రిల్ 16 (సమయం న్యూస్):** అపరిచిత వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే భయపడవద్దని, తమకు సమాచారం అందించాలని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలో గల ఎమ్ ఎస్ ఎన్ పరిశ్రమలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే భయపడకుండా, తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ఆయా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, యువకులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్!!

* **ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఎస్సై మధుకర్ రెడ్డి.!!**

**శివంపేట్ ఏప్రిల్ 16 (సమయం న్యూస్):** శివంపేట మండల కేంద్రంలోని చెంది గ్రామంలో చండికామాత దేవాలయ పరిసర ప్రాంతంలో మూడు ముక్కలాట ఆడుతున్నారని స్థానికుల సమాచారం మేరకు ఎస్సై మధుకర్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బందితో వెళ్లారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు, శివన్న గారి శివుడు, వల్తూరి శ్రీశైలం, సంధి గారి నర్సింలు విరిపై కేసు నమోదు చేసారు. ఈ ముగ్గురు కూడా చంది గ్రామానికి చెందిన వారే మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్నారు. వారి వద్ద నుండి 1620. రూపాయలు మరియు ఒక సెల్ ఫోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# వి ఆర్ దేశాయ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి

**బోధన్ పట్టణం, 16 ఏప్రిల్, సమయం న్యూస్:** బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వరరావు దేశాయ్ నీ వారినివాసంలో బుధవారం మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం వి ఆర్ దేశాయ్ పుత్రుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారన్న విషయం తెలుసుకొని వి ఆర్ దేశాయ్ నీ మాజీ మున్సిపల్ చైర్మన్ సునీతదేశాయిని కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యంగా ఉండాలని అన్నారు. వీరి వెంట రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నాయకులు నగేష్ రెడ్డి, డిపిసిసి డెలిగేట్ గంగ శంకర్, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, అంకు దామోదర్ రెడ్డి (అంకు దాము), బ్లాక్ ప్రెసిడెంట్, నరేందర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు విఆర్ దేశాయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.






# రాజీవ్ యువ వికాసంలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

**హబ్సిగూడ కాంగ్రెస్ నేత విజ్ఞప్తి**

**అంబర్ పేట, ఏప్రిల్16, సమయం న్యూస్:** హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరిపే పవన్ కుమార్ వంజరి మంగళవారం బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాజీవ్ యువ వికాసం కార్యక్రమంలో బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కుమార్ వంజరి మాట్లాడుతూ, రాష్ట్రంలోని బీసీ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అయితే, ఈ పథకంలో బీసీలకు కేటాయింపులు పెంచితే మరింత మంది నిరుద్యోగయువతకు లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బీసీల సంక్షేమం కోసం ఇలాంటి పథకాలు తీసుకురావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పవన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరిపే మల్లేష్ వంజరి, రాఘవేంద్ర, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జిన్నారం ఏప్రిల్ 16 (సమయం న్యూస్): మండల కేంద్రమైన జిన్నారం తో పాటు ఊట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం నరేందర్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా, రైతులు నేరుగా వారు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని, రైతును రాజును చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ గంగ రమేష్, సీసీ సుజాత, మాజీ వార్డు సభ్యులు గోకర శ్రీధర్ గౌడ్, వివిధ పార్టీ నాయకులు శ్రీకాంత్ గౌడ్, మంద రమేష్, నరేందర్ గౌడ్, కోటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మేదరి శంకరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రుల పై ప్రేమతో చలివేంద్రం ఏర్పాటు

**గుమ్మడిదల ఏప్రిల్ 16 (సమయం న్యూస్) :** సంగారెడ్డి రెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని బుధవారం నాడు ఏర్పాటు చేసిన యువకుడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుమ్మడిదల ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులు పై ప్రేమతో కీర్తిశేషులు పోతరాజు నర్సమ్మ, బాల నర్సయ్య గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో స్ఫూర్తిదాయకం మనీ ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు జయశంకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, బిక్షపతి మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, గడ్డం యాదగిరి పెంటారెడ్డి, రమేష్, గ్రామ పెద్దలు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, భార్గవ చారి తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

జిన్నారం ఏప్రిల్ 16 (సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి 15 లక్షల ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఎం ఎస్ ఎన్ పరిశ్రమలో పనిచేస్తూ గత ఏడాది ప్రమాదవశాత్తు మృతి చెందిన శంకర్ రెడ్డి (32) కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో ఆనంద్ కృష్ణారెడ్డి తో పాటు, స్థానిక నాయకులు చర్చించి మృతుని భార్య సోనియా కు 15 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని పరిశ్రమ యాజమాన్యం అందజేశారు. ఈ మొత్తంలో 50% మృతుని కూతురుకు, 25 %మృతుని తల్లికి ,25% మృతుని భార్యకు చెందే విధంగా ఒప్పందంతో పరిహారం అందజేయడం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు పరిశ్రమ యాజమాన్యానికి ఆనంద్ కృష్ణారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం ఏప్రిల్ 16 (సమయం న్యూస్): మండల కేంద్రమైన జిన్నారంతోపాటు సోలక్ పల్లి ,శివనగర్ సబ్ స్టేషన్ లకు గురువారం ఉదయం 8 గంటల నుండి 12:30 వరకు 33/11 కే వి సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా, ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం వుంటుందని జిన్నారం ఏ.ఈ.వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ గ్రామాల విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

# యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**- ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి**

**బోధన్ మండలం, పెగడపల్లి గ్రామం, 16 ఏప్రిల్, సమయం న్యూస్ :** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో సీజన్ 2, పిపిఎల్ పెగడపల్లి ప్రీమియర్ లీ క్రికెట్ టోర్నమెంట్ ఏప్రిల్ 1న ప్రారంభమై ఏప్రిల్ 16న ముగిసింది. ఈ సీజన్ పిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్లో సుమారుగా జిల్లాలోని సుమారుగా 40 జట్లు పాల్గొనగా బుధవారం ఫైనల్ పోరులో పెగడపల్లి, పెంటాకలన్ గ్రామాల టీంలు పోటీ పడగా పెంటాకలాన్ మొదటి విజేతగా నిలువగా రన్నరప్ గా పెగడపల్లి టీం నిలిచింది. వీరికి నగదును ట్రోఫీని అందజేయడానికి మాజీ మంత్రి బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీదారులకు బహుమతులను ప్రదానం చేశారు. విజేతకు 25,555/ నగదు ట్రోఫీ, రన్నరప్ కు 12,222/ నగదును ట్రోఫీని, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తదితర బహుమతులను క్రీడాకారులకు మెమెంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత ఆన్లైన్ బారిన పడకుండా ఇలాంటి క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఈ క్రీడల వల్ల శారీరక మానసిక దారుఢ్యాలను పెంపొందించడమే కాక జీవనశైలికి ఎంతో తోడ్పడతాయని, యువత క్రీడలలోనే కాకుండా విద్యపై కూడా ప్రత్యేక దృష్టి సాధించాలని ఉన్నత విద్యలను అభ్యసించి ఉద్యోగాలలో స్థిరపడాలని కాంగ్రెస్




ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాల కొరకై నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నామని, యువత పెడదారి పట్టకుండా ఉద్యోగం చేసుకొని ఒక స్థిర జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడం కొరకు ఈ అవకాశాల్ని కల్పిస్తున్నామని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. టోర్నీ విజేత పెంటాకలాన్ టీం కెప్టెన్ పులిందర్ మాట్లాడుతూ పి పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ చాలా చక్కగా నిర్వహించారు. 16 రోజులు ఈ టోర్నమెంట్ చాలా చక్కగా నడిచింది విజేతగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందని, మమ్మల్ని ఎంకరేజ్ చేసిన మా గ్రామ అలాగే పెగడపల్లి గ్రామ ప్రేక్షకులకు ధన్యవాదాలు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని నగదును అందుకోవడం చాలా సంతోషంగా ఉంది వారు మాకు ట్రోఫీని అందించినందుకు మా గ్రామ తరఫున ఎమ్మెల్యే కు ఇక్కడికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతీరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డిపిసిసి డెలికేట్ గంగా శంకర్, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, నరేందర్ బోధన్ ఏఎంసీ ఇంచార్జ్ చైర్మన్ చీల శంకర్, బోధన్ మండల తహసిల్దార్ విటల్, రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రాజారెడ్డి, విడిసి చైర్మన్ లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు పోతరెడ్డి, సుదర్శన్, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, సాయిలు, కోక సాయిలు, నాగరాజు, లింగారెడ్డి, శంకర్, నాగభూషణం, టోర్నమెంట్ నిర్వాహకులు మోహన్, గణేష్, రాజు, సావేందర్, నరేష్, మనోజ్, భరత్, మేడి రవి, కృష్ణ, విజయ్, ముజీబ్, దేవరాజ్, అనిల్ రెడ్డి, సన్నిత్ రెడ్డి, యోగేష్ ప్రసాద్, శేఖర్, నూర్, సతీష్, బీరుగొండ, రఫిక్, మహేష్, బన్ను, వికాస్ రెడ్డి లింగారెడ్డి ఎస్టిడి రాజు, ఫయాజ్, శ్రీను, రాజు, అశోక్, హైదర్, పెగడపల్లి గ్రామ ప్రముఖ నాయకులు, పి పి ఎల్ నిర్వాహక కమిటీ సభ్యులు, టోర్నీ విజేతలు పెంటకలన్ టీం పులిందర్, రాజు, అశోక్, నరేష్, యోగేష్, మాజీ సర్పంచ్ రమణ, ప్రముఖులు, యువత తదితరులు పాల్గొన్నారు.






**చిత్తూరు లో ఎస్టిమేషన్ కమిటీ సమీక్ష సమావేశంలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ**

**సమయం న్యూస్, చిత్తూరు**

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి

# మార్కింగ్ ప్రక్రియ ను వేగవంతం చేయండి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

**నిర్మల్ ఏప్రిల్ 16( సమయం న్యూస్) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మార్కౌట్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ, వేసవిలో త్రాగునీటి సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై ఆమె సంబంధిత అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తిచేసిన ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్ వివరాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆమె మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొలి దశలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మార్కౌట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హతలు, జిఓ కి సంబంధించిన వివరాలపై ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా



గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రాగునీటి సమస్యలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని, బోరు బావులు, చేతిపంపులు చెడిపోతే వెంటనే మరమ్మత్తులు చేపట్టి త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అవసరమైన గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. భూగర్భజలాల లభ్యత తక్కువగా ఉన్న మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకే నిర్వహించాలని, పనుల ప్రదేశాల్లో త్రాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ పొట్లాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని 117 ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధి హామీ నిధుల ద్వారా 228 మరుగుదొడ్లను మంజూరు చేశామని, వాటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండల కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు అవసరమైతే తగిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, పిడి హౌసింగ్ రాజేశ్వర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

* 5గురు పేకాటరాయుళ్లను, నగదు, సెల్ఫోన్, ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను అదుపులో తీసుకున్న పోలీసులు



**బోధన్ పట్టణం, 16 ఏప్రిల్ సమయం న్యూస్:** బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చెట్ల పొదలలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు వారిని పట్టుకునేందుకు పట్టణ సీఐ వెంకటనారాయణ ఎస్సై భాస్కర్ తమ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయులను పట్టుకోగా వారి దగ్గర నుండి నగదు 3,100/ రూపాయలు, 5 మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు ఒక ఆటోను పట్టుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేయకూడదని, అలా చేసినట్లయితే చట్ట ప్రకారం చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

# సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన మంత్రి జూపల్లి



**నిజామాబాద్ ఏప్రిల్ 16( సమయం న్యూస్) :** ఆర్మూర్ మున్సి పాలిటీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న, ఆయన ఉమ్మడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగారు. ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని, మీ లాంటి ఉమ్మడి కుటుంబాలను చూడటం, మీతో కలిసి భోజనం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి కుటుంబాల వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకు తుందని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారని, సన్న బియ్యం మార్కెట్ లో కొనుక్కుని తిరేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అహ్మద్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, ఇతర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాఠశాలలు..
# వసతి గృహాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలి



**మెదక్ ఏప్రిల్16 (సమయం న్యూస్) :** క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, పరిశుభ్రతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలు కావాలని దీనికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా కౌడిపల్లిలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 105 ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు వసతి గృహాల్లో శుభ్రతలో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలవుతుందని, కౌడి పల్లి బాలికల వసతి గృహంలో మొన్న జరిగిన సంఘటన పై స్పందించడం జరిగిందన్నారు. అస్వస్థతకు గురైన బాలి కలను వసతి గృహంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు చికిత్సలు అందించడం జరిగిందని వివరించారు. , ఎవరికి ఎటువంటి అపాయం లేదని వివరించారు. ఈ సంఘటనపై కలెక్టర్ స్వయంగా వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడటం జరిగింది ప్రస్తుత సౌకర్యాలు పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా మొబైల్ నెంబర్ విద్యార్థినిలకు అందించి ఎటువంటి సమస్య ఉన్న తనకు కాల్ చేయాలని చెప్పడం జరిగింది. జిల్లాలో ఇకముందు సంక్షేమ పాఠశాలలు వసతిగృహాల్లో ఇలాంటి సంఘటనలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేటట్లు వార్డె న్లకు ఆదేశించడం జరిగిందన్నారు విద్యార్థినిలు అస్వస్థత సంఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయడం జరిగిందని నివేదికల ఆధారంగా బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజాసేవ కర్తవ్యం గా ఉద్యోగులు తమ విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి , పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యా బోధన, అందించాలని అధికారులు ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి

* హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హనుమకొండ ఏప్రిల్ 16( సమయం న్యూస్) :** మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి లో పలువురు లబ్ధిదారులకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణం చేపట్టి ఎన్ని రోజులు అవుతుందని, నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడినుండి తెచ్చుకుంటున్నారని, ఇప్పటివరకు ఎంత ఖర్చయిందని, ఎంత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులను కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకునే విధంగా చూడాలన్నారు. బేస్మెంట్ పూర్తయిన ఇండ్లకు రెండు రోజుల్లో లక్ష రూపాయల చొప్పున లబ్ధి దారుల ఖాతాల్లో జమా చేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామానికి ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు ఎన్ని ప్రారంభమయ్యాయి అని ఎంపీడీవో వీరేశంను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధి దారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇంది రమ్మ మోడల్ హౌస్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎంపీడీవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్



**వనపర్తి ఏప్రిల్16 (సమయం న్యూస్):** భూభారతి పోర్టల్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూరు మండలంలోని ఖాజీపూర్ లో గురువారం నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సు కు హాజరవుతున్న రెవెన్యూ, సమాచార పౌరా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున ఖాజీపూర్ లో బుధవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్య వేక్షించారు. గ్రామంలోని రెండు స్థలాలను చూసిన కలెక్టర్ మండల పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలో భూభారతి రెవెన్యూ సదస్సుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండ లాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా గురువారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూ భారతి సదస్సును మండలంలోని ఖాజీపూర్ లో ప్రారంభించనున్నారు. అందుకోసం ఖాజీపూర్ లో ఏర్పాట్ల ను కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. మంత్రి చే ప్రారంభించే భూభారతి సదస్సుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డిఓ రామచందర్ నాయక్, మద్దూర్ తహసిల్దార్ మహేష్ గౌడ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## ఆడపిల్లల వివాహానికి
# పుస్తెమెట్టెలు అందజేత

**జిన్నారం ఏప్రిల్ 16 (సమయం న్యూస్) :** జిన్నారం మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన బాగాని లింగం కుటుంబములో జరిగే ఇద్దరు కుమార్తెల వివాహలకు బుధవారం జిన్నారం మాజీ ఎంపిపి రవీందర్ గౌడ్ పుస్తెమెట్టలను అందించారు.ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఆడపడుచుల వివాహా లకు తనకు తోచిన సహాయం ఎల్ల వేళలా అందిస్తానని తెలిపారు. కుటుంబ సభ్యులు రవీందర్ గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కరుణాకర్ గౌడ్ ,వెంకటేష్ ,రమేష్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కు శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు

**అంబర్ పేట,ఏప్రిల్ 16, సమయం న్యూస్:** శాసనమండలి లోఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ.దాసోజు శ్రవణ్ కు శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు అంబర్ పేట వంజరి సంఘం ప్రధాన కార్యదర్శి డి.గంగరాజు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాలిక్.



# కొమురయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బాల్య మిత్రులు..!!

**శివంపేట్ ఏప్రిల్ 16 (సమయం న్యూస్) :** శివంపేట మండల కేంద్రం లోని పెద్ద గొట్టుముక్కల గ్రామానికి చెందిన గుండ కొమరయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ విష యం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు పూర్వ విద్యార్థులుగుండ కొమురయ్య కుటుంబానికి 27,000 మిత్రుని కుటుంబానికి అందజేశారు. చిన్ననాటి మిత్రులు కాముని అనిల్ కుమార్, వడ్ల వీరేశం చారి, దొంతి నారాయణ గౌడ్, రేవు యాదగిరి, ఆంజనేయులు. మరియు చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు.



# ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత డా. దాసోజు శ్రవణ్ కుమార్ కు శుభాకాంక్షలు

అంబర్ పేట, ఏప్రిల్ 16, సమయం న్యూస్: అసెంబ్లీ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రావణ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు బిఆర్ఎస్ నాయకులు.అసెంబ్లీ ప్రాంగణంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, దూసరి శ్రీనివాస్ గౌడ్, సంతోష్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు ...

# మేం చాలా చెత్తగా ఆడాం కదా: రహానే



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్‌కు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లకు 111 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఛేదనకు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ 15.1 ఓవర్లకు 95 పరుగులకు వికెట్లన్నీ కోల్పోయింది. పంజాబ్ చేతిలో 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. చాహల్ తన బౌలింగ్‌లో విజృంభించి కేవలం 28 పరుగులిచ్చి 4 వికెట్లు కూల్చాడు. చాహల్ వేసిన గూగ్లీని తప్పుగా అంచనా వేసి రహానే స్వీప్ షాట్ ఆడాడు. బంతి ఎక్కువగా టర్న్ కాకపోవడంతో అది ప్యాడ్లకు తాకింది. చాహల్ అపీల్ చేయడంతో అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. కానీ రహానే రివ్యూకు వెళ్లలేదు. రిప్లేలో ఆ బంతి పిచింగ్ ఔట్ సైడ్‌గా సూచించింది. రివ్యూకు వెళ్లి ఉంటే రహానేను థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించి ఉండేవాడు. ఈ విషయమై మ్యాచ్ అనంతరం రహానే మాట్లాడాడు. 'ఓ బ్యాటర్‌గా నేను రివ్యూను సేవ్ చేయాలనుకున్నాను. అది తర్వాత ఉపయోగపడుతుంది అనుకున్నా. ఒకవేళ నేను ఇప్పుడు రివ్యూ తీసుకుంటే అనవసరంగా దాన్ని కోల్పోతాం అనుకున్నా. అందుకే రివ్యూ తీసుకోలేదు' అని రహానే వివరించాడు. కఠినమైన పిచ్ మీద ఆడటానికి ఇరు జట్లలోని ఆటగాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మ్యాచ్ అనంతరం అజింక్య రహానే, శ్రేయస్ అయ్యర్‌తో కరచాలనం చేస్తూ.. 'మేం చాలా చెత్తగా ఆడాం కదా' (క్యా ఫాల్తూ బ్యాటింగ్ కరే

# లఖ్‌నవూకు గుడ్‌న్యూస్.. జట్టులో చేరిన స్టార్ పేసర్



ఐపీఎల్ 2025లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు అదిరిపోయే న్యూస్. పేస్ సంచలనం మయాంక్ యాదవ్ ఎట్టకేలకు ఫిట్‌నెస్ సాధించి బుధవారం జట్టుతో కలిశాడు. వరుస గాయాల నుంచి కోలుకున్న మయాంక్ కొన్ని వారాల క్రితమే లఖ్‌నవూ జట్టులో చేరాల్సింది. కానీ, జట్టులో చేరడానికి సిద్ధమవుతుండగా అతడి మునివేళ్లకు గాయమైంది. దీంతో మళ్లీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లాడు. తాజాగా ఆ గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించాడు. ఏప్రిల్ 19న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో మయాంక్ ఆడే అవకాశం ఉంది. ఈ స్టార్ పేసర్ రాకతో లఖ్‌నవూ బౌలింగ్ బలం మరింత పెరిగింది. 2024 ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన మయాంక్ యాదవ్ బుల్లెట్ లాంటి బంతులు విసిరాడు. నాలుగు మ్యాచ్‌లే ఆడినా ఎంతో ప్రభావాన్ని చూపించాడు. నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బంతులేస్తూ ఔరా అనిపించిన అతడు.. ఏడు వికెట్లు పడగొట్టాడు. గాయం కారణంగా మయాంక్ చాలా త్వరగా టోర్నీని వీడాడు. గతేడాది జరిగిన మెగా వేలానికి ముందు మయాంక్‌ను లఖ్‌నవూ రూ.11 కోట్లకు రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో ఎల్ఎస్‌జీ ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌లు ఆడింది. నాలుగు విజయాలు, మూడు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది.

# చాహల్.. నీ టాలెంట్ మామూలుగా లేదు: మహ్‌వశ్ పోస్ట్ వైరల్

లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో డేటింగ్ వార్తల వేళ రేడియో జాకీ మహ్‌వశ్ చేసిన పోస్ట్ మరోసారి నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ బౌలర్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం చాహల్‌ను ప్రశంసిస్తూ మహ్‌వశ్ తన ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ చేసింది. అతడితో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేసిన ఆమె.. "నీ టాలెంట్ మామూలుగా లేదు. అందుకే ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు సాధించావ్. అసంభవ్..!" అని రాసుకొచ్చింది.

# గద్దర్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా జయసుధ



హైదరాబాద్: తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి ఛైర్మన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ఈ నెల 21 నుంచి జ్యూరీ పరిశీలించనుంది. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో సమావేశమైన ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇస్తున్నట్టు గుర్తుచేసిన దిల్ రాజు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదన్నారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లురాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో 'కోర్ట్' వెర్సెస్ 'ఛావా'..




ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్ టాక్‌ను సొంతం చేసుకున్నాయి 'కోర్ట్', 'ఛావా' చిత్రాలు. థియేటర్‌లలో సందడి చేసిన ఈ రెండు సినిమాలు ఏప్రిల్ 11న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకువచ్చాయి. అక్కడ ఈ రెండు వ్యూస్ పరంగా పోటీని ఎదుర్కొంటున్నాయి. విక్కీ కౌశల్ హీరోగా తెరకెక్కిన 'ఛావా' మార్చి 7న తెలుగు ప్రేక్షకులను పలకరించింది. హిందీలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా టాలీవుడ్‌లోనూ విజయాన్ని సొంతం చేసుకుంది. ఏప్రిల్ 11న నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. దీంతోపాటే చిన్న సినిమాగా విడుదలై ప్రశంసలు అందుకుంది 'కోర్ట్'. ఈ చిత్రం కూడా ఏప్రిల్ 11నే ఓటీటీలోకి వచ్చింది. ఇప్పుడీ రెండు సినిమాలు 2.2 మిలియన్ల వ్యూస్‌నే సాధించాయి. అయితే వీక్షణల గంటల పరంగా 'ఛావా' టాప్4 స్థానం సొంతం చేసుకుంది. దీనికి 5.9 మిలియన్ గంటల్లో ఇన్ని వ్యూస్ రాగా.. 'కోర్ట్'కు 5.4 మిలియన్ గంటల్లో 2.2 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. దీంతో ఇది టాప్ 5కు పరిమితమైంది.

## సినిమా

# మీరెలాంటి మనుషులు?

○ ట్రోలర్స్‌కు ఖుష్బూ స్ట్రాంగ్ కౌంటర్



ఒకప్పుడు సౌత్ లో టాప్ హీరోయిన్ గా చలామణి అయిన ఖుష్బూ.. చిరంజీవి, వెంకటేశ్ లాంటి అగ్ర హీరోలతో నటించింది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. పెళ్లి చేసుకున్న తర్వాత చాలా కాలం పాటూ సినీ ఇండస్ట్రీకి దూరంగానే ఉంది. మళ్లీ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ ను మొదలుపెట్టి తనదైన శైలిలో సత్తా చాటుతోంది ఖుష్బూ. ఇటీవలే 'నేసిప్పాయ' అనే తమిళ సినిమాలో కనిపించారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో తరచూ తన ఫొటోలు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లోనే ఉంటోంది ఖుష్బూ. తాజాగా ఆమె తన న్యూలుక్ పిక్స్ షేర్ చేసింది. ఈ ఫొటోలకు 'బ్యాక్ టూ ద ఫ్యూచర్' అనే క్యాప్షన్ ఇచ్చింది. అందులో ఖుష్బూ చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతుంటే.. మరికొందరు మాత్రం ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. దీనికి ఆమె స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. 'అసలు మీరెలాంటి మనుషులు? మీ ముఖాలను మీరెప్పుడు చూపించరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది' అంటూ రిప్లై ఇచ్చింది. ఈ ట్వీట్‌ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# స్టైలిష్ లుక్



కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ ఇండస్ట్రీలో ఇప్పటికే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. సొంత ఇమేజ్, టాలెంట్‌తోనే నటిగా రాణిస్తూ, ఆఫర్లు దక్కించుకుంటూ వచ్చింది. 'అనగనగా ఓ ధీరుడు' సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ తర్వాత వరుసగా హిట్స్ అందుకుంటూ మంచి ఫేమ్ సంపాదించుకుంది. గబ్బర్‌సింగ్, బలుపు, ఎవడు, రేసు గుర్రం, శ్రీమంతుడు, క్రాక్ ఇలా చాలా సినిమాల్లో నటించి నటనతో ఆకట్టుకుంది. దీనికితోడు గెస్ట్‌రోల్, ఐటెం సాంగ్స్‌తోనూ మెస్మరైజ్ చేస్తూ పాన్ ఇండియా స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. ప్రసెంట్‌ఈ బ్యూటీ రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రానున్న 'కూలీ'లో నటిస్తోంది. సూపర్‌హిట్ చిత్రం 'సలార్'కు కొనసాగింపుగా రానున్న 'సలార్ శౌర్యాంగపర్వం'లో నటించనుంది. త్వరలో ఇది పట్టాలెక్కనుంది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఈబ్యూటీ రెగ్యులర్‌గా అందమైన ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు తన సినిమా అప్‌డేట్‌లతో పాటు వ్యక్తిగత విషయాలనూ అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా మరోసారి స్టైలిష్ అవతార్‌లో పిక్స్ షేర్ చేసింది. ఇలాంటి విభిన్నంగా ఉన్న ఔట్ ఫిట్‌లను ధరించడం కేవలం శృతి హాసన్‌కే సాధ్యం అంటూ ఫ్యాన్స్‌పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

# 'హరి హర వీరమల్లు'లో అదే హైలైట్ కానుంది..

**దర్శకుడి ఆసక్తికర కామెంట్స్**



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. దీంతో ఈ మూవీపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. "ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుంది" అని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్ 1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD.
PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.